నత్తనడకన సబ్‌స్టేషన్ల నిర్మాణాలు

- పనులపై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు


చివరి దశలో ఉన్న మంచాలకట్ట సబ్‌స్టేషన్


అసంపూర్తిగా పెంట్లవెల్లి సబ్‌స్టేషన్

పెంట్లవెల్లి: మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా గత ప్రభుత్వం పెంట్లవెల్లితో పాటు మంచాలకట్ట గ్రామానికి సబ్‌స్టేషన్లు మంజూరు చేశారు. రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంచాలకట్ట గ్రామంలో 5 సంవత్సరాల కిందట రూ.1.5 వ్యయంతో చేపట్టిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు ఇప్పటికి కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. పనులు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజల కరెంటు సమస్యలు తీరుతాయని ప్రజలు గతంలో సంతోషపడ్డారు కాని వారి ఆశలు నిరాశగా మారాయి. మండల కేంద్రంలో కూడా గతం 2010లో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ అది కూడా ఇప్పటికి వరకు పూర్తి కాలేదు. త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తే కరెంటు సమస్య ఉండదని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



గ్రామంలో విద్యుత్ అధికంగా ఉంది. ఐదేళ్ల కిందట చేపట్టిన సబ్‌స్టేషన్ పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పనులు చేయడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడు. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తి చేసి సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామంలో కరెంటు సమస్యలు తీర్చాలి.

– చినరాముడు, మంచాలకట్ట

పనులు వేగవంతం చేస్తాం

ప్రస్తుతం మంచాలకట్ట సబ్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయి. చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయి. అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. ఈనెల ఆఖరు వరకు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. పెంట్లవెల్లి సబ్‌స్టేషన్ పనులు కూడా వేగవంతం చేస్తాం.

– విజ్ఞాన్, ఏఈ , పెంట్లవెల్లి

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

పెంట్లవెల్లి సబ్‌స్టేషన్ పనులపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడు. ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లాం. పనులు పూర్తయితే విద్యుత్ సమస్య తీరుతుంది. పనులు వేగవంతం చేయాలి.

– రామన్‌గౌడ్, పెంట్లవెల్లి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చారకొండ: ప్రతి ఒక్కరు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శంషోద్దీన్ కోరారు. మంగళవారం మండలం కేంద్రంలో సైబర్ నేరాలపై, కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, నిత్యం ఎక్కడో ఒక చోట సైబర్ ఉచ్చులో పడుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. ఏఎస్‌ఐ అంజయ్య, మర్రిపల్లి మాజీ సర్పంచ్ నరేష్ నాయక్, సిర్సనగండ్ల మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావు, పీసీలు శేఖర్, ప్రశాంత్, నాయకులు వెంకటయ్య గౌడ్, కొండల్, అశోక్ గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంషోద్దీన్

రాంపూర్‌లో అవగాహన

లింగాల: మండలంలోని రాంపూర్‌లో మంగళవారం సైబర్‌నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గోప్లాపూర్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సు

పెంట్లవెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంలో భాగంగా మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని గోప్లాపూర్, వేముకల్లులో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసింహ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలను రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గోప్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్, బాలకోట్యానాయక్, ఉమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ప్రశాంతంగా 'యువ వికాసం' ఇంటర్వ్యూలు


తిమ్మాజిపేటలో అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు


కల్వకుర్తిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

తిమ్మాజిపేట: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి రోజు మంగళవారం అధికారులు ప్రశాంతంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు పోతిరెడ్డిపల్లి పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన దరఖాస్తు దారుల సర్టిఫికెట్‌లను పరిశీలించారు. దరఖాస్తుదారులు ఉదయం 9 గంటలకే ఇంటర్వ్యూల కోసం తిమ్మాజిపేటలోని ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. మండల ప్రత్యేకాధికారి, డీఈఓ రమేష్‌కుమార్ అభ్యర్థుల యూనిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఎంపీఓ రాములు, మేనేజరు భరత్, ఏపీఎం బాలస్వామి, పలువురు కార్యదర్శులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాదారం యూకో బ్యాంక్ అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి వెంకట రాములు, బ్యాంకు మేనేజర్ హరిచంద్ర ప్రసాద్, ఏపీఎం సైదులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడూరు: తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో 411 దరఖాస్తులు చేసుకోగా 177 మంది ఇంటర్వ్యూలు హాజరయ్యారు. ఎంపీడీఓ అంజనేయులు, ఎంపీఓ నర్సింహులు పాల్గొన్నారు.

నేటి నుంచి చారకొండలో..

చారకొండ: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు బుధవారం ఎస్సీ, మైనార్టీలకు, 8న ఎస్టీ కార్పొరేషన్ అభ్యర్థులకు, 9, 12 బీసీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేడు ఎస్‌బీఐ పరిధిలో..

నాగర్‌కర్నూల్ ఎస్‌బీఐ పరిధిలో 611 మంది దరఖాస్తు చేసుకున్నారని వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

కోడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కోడేరు, జనుంపల్లి, నాగులపల్లి, పస్పుల, తీగలపల్లి గ్రామాల లబ్ధిదారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపటి నుంచి..

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు ఈ నెల 8వ తేది నుంచి 14 వరకు బ్యాంక్‌ల వారిగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న ఏపీజీవీబీ తుమ్మన్‌పేట, పంజాబ్ నేషనల్ బ్యాంక్ పెద్ద కార్పముల పరిధిలోని వారికి అదే విధంగా 9న మరియు 12 నుంచి 14వ తేది వరకు ఎస్‌బీఐ లింగాల, అచ్చంపేట బ్యాంక్ పరిధిలోని వారికి ఇంటర్వ్యూలు జరుపబడుతాయని ఆయన తెలిపారు.

కొల్లాపూర్: ఈ నెల 8వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని దరఖాస్తుదారులకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



లింగాల: మండల కేంద్రానికి చెందిన గాలేటి ప్రభాకర్ ఇటీవల బల్మూర్ మండలం మైలారం బస్ స్టేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ట్రాక్టర్స్, జేసీబీ యూనియన్ల నాయకులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.45,500లు ఆర్థికసాయం చేశారు. అన్నివిధాలా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ట్రాక్టర్స్, జేసీబీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పాఠ్యాంశంగా చేర్చాలి

మన్ననూర్: ఆర్యవైశ్యుల కుల దేవత కన్యకా పరమేశ్వరి అమ్మవారి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి సంబు వెంకటరమణ అన్నారు. మంగళవారం ఓం చౌరస్తాలో కన్యకాపరమేశ్వరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం విలువలతో పాటూ ఆత్మార్పణ ప్రతీకగా నిలిచిన అమ్మవారి జీవిత చరిత్రను తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ సత్యనారాయణ, ఉమామహేశ్వర పాలక మండలి సభ్యురాలు సంబు శోభ, భాగ్యలక్ష్మి, సంబు నరేష్, రమేష్, నీల శ్రీనివాసులు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంఈఓ మృతి

కొల్లాపూర్: రిటైర్డ్ ఎంఈఓ ఎంఏ బాకర్‌అలీ(70) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కొల్లాపూర్‌లో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించారు. మంగళవారం మృతదేహంపై కాంగ్రెస్ నాయకులు, ఉద్యోగులు, పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింహరావు, ఎక్బాల్, మాజీ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు రుక్మద్దీన్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్టపాగ రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



తాడూరు: మండలంలోని బలాన్‌పల్లిలో కొంతకాలంగా విద్యుత్ సమస్యలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండటంతో మంగళవారం విద్యుత్ లైన్ల పనులను చేపట్టారు. ఇందులో భాగంగా నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. మొత్తం దాదాపు 30 స్తంభాలు ఏర్పాటు చేశామని ఏఈ తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంపు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తునట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ జీవన్‌కుమార్, స్కూల్ హెచ్‌ఎం గోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతులు చదువుకునే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథ్స్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్, క్రాఫ్ట్ తదితర అంశాల్లో నిపుణులు మెళకువలు నేర్పిస్తారని తెలిపారు.

సన్న వడ్లకు రూ.500 బోనస్

వెల్దండ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొల్లంపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి-గ్రేడ్‌కు రూ.2300లు మద్దతుధర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యాన్ని తేమశాతం 17 కంటే తక్కువ లేకుండా చూడాలన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. వరిధాన్యం తడవకుండా రైతులకు ప్లాస్టిక్ కవర్లను అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డాక్యనాయక్, రామకృష్ణ, రైతులు తదితరులు ఉన్నారు.


బొల్లంపల్లిలో వరికొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కార్తీక్‌కుమార్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

తెలకపల్లి: మండలంలోని కారువంగ, చిన్నముద్దునురు, బండపల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీఓ నర్మదలు సందర్శించారు. రైతులకు సూచనలు, సలహాలు చేశారు. వరి తేమ శాతం నుంచి 12 వరకు తేమ ఉండాలన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. రైతుల గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర టోకెన్ తీసుకోవాలని కోరారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.


వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏఓ

మహాసభలను విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పట్టణంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 29 రాష్ట్రాల నుంచి 1000మంది పైగా యువజన ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. శివకృష్ణ, సత్యం, వెంకటయ్య, శేఖర్, మధు జీవన్, ఆంజనేయులు, కృష్ణ, వెంకటయ్య, గురు, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి రూరల్: మద్యం తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తిని పోలీసులు కోర్టులో హాజరపరిచారు. మంగళవారం న్యాయమూర్తి నిందితుడు యాదయ్యకు ఒకరోజు జైలుశిక్ష తో పాటు రూ.100ల జరిమానా విధించారని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

తరుగు పేరుతో మోసం తగదు



పెద్దకొత్తపల్లి: తరుగు పేరుతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి దశరథం ఆరోపించారు. మండలంలోని దేవుని తిర్మాలాపూర్‌లో మంగళవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం మండల కార్యదర్శి దశరథం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మోసాలకు పాల్పడుతున్నవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బాలస్వామి, ఈశ్వర్, రమేష్, మల్లేష్, శ్రీను, వెంకటయ్య, చంద్రమ్మ, లక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూరేనా?


మల్లాయిపల్లిలో లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ (ఫైల్)

పాన్‌గల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చివరి విచారణ మొదలైంది. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా వివరాలతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన మొదలెట్టారు. జాబితాలో పేరున్న ప్రతి ఇంటి తలుపు తడుతూ ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఓ, మండల పంచాయతీ అధికారులు, ఏఈలు వేర్వేరుగా గ్రామాల్లో జాబితాపై విచారణ చేస్తున్నారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు కలిపి మొత్తం 548 ఇళ్లు మంజూరయ్యాయి. ఆయా జీపీల్లో పెద్ద జీపీలు కేతేపల్లికి 50, పాన్‌గల్‌కు 45, రేమద్దులకు 56, బుసిరెడ్డిపల్లికి 34 చొప్పున ఇళ్లు కేటాయించారు. గ్రామాల్లో 70 మంది ఓటర్లకు ఒక ఇల్లు చొప్పున ఇళ్లు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. కేటాయించిన ఇళ్లు ఏమాత్రం సరిపోవని ఆయా గ్రామాల నాయకులు అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు సూచిస్తున్నా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు కేటాయిస్తున్నామని, అవసరమైతే రెండో విడతలో మళ్లీ మంజూరు చేస్తామని చెబుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి జూపల్లి అధికారులు, నాయకులకు తగు సూచన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఎట్టి పరిస్థితుల్లో అనర్హులను గుర్తించొద్దన్నారు.

ఇళ్లు లేని వారికి..



ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మొదటగా ఇళ్లు లేనివారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసేటప్పుడు వారికి ఇళ్లు, స్థలం ఉందా లేదా అనే విషయాలను గుర్తించి వారిలో పేద వారికి న్యాయం చేయాలి.

– రేణుకమ్మ, పాన్‌గల్

వీరు అనర్హులు..

- సొంత స్థలం ఉన్నా ఆర్‌సీసీతో ఇంటి నిర్మాణం ఉంటే.
- 2.5 ఎకరాల తడి(ఇరిగేషన్), 5 ఎకరాల మెట్ట (డ్రై) భూమి ఉన్నవారు.
- 4 చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారు
- కిసాన్ క్రెడిట్ కార్డు కలిగి ఉండి రూ.50 వేలపై పరిమితి మించితే
- కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఆదాయపన్ను, ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లింపుదారులుంటే
- ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే, వలస వచ్చిన కుటుంబాలైతే వీరు అర్హులు కారాని అధికారులు చెబుతున్నారు.

అర్హులను గుర్తిస్తున్నాం



మండలంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన లబ్ధిదారుల వివరాలల్లో అర్హులా కాదా అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. మండలంలోని 28 జీపీల్లో ఇప్పటి వరకు 18 జీపీల్లో వివరాల సేకరణ పూర్తి చేశాం. ఇంకా 10 జీపీల్లో చివరి స్థాయిలో ఉంది. వాటిని పూర్తి చేసి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తాం.

– గోవిందరావు, ఎంపీడీఓ, పాన్‌గల్

పంటల సాగుపై రైతులకు అవగాహన

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ అధికారులు రైతు నేస్తం పేరుతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తలు వానాకాలం పంట ప్రారంభంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భూసారం, విత్తనశుద్ధి, విత్తనాలు నాటడం, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ కమల్ కుమార్, ఆయా గ్రామాల ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమాలు



తాడూరు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శతచండీ మహాయాగంలో భాగంగా రెండో రోజు మంగళవారం ఉదయం నుంచి హోమాలు, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గ్రామంలో పండుగ సందడి కన్పించింది. పూజారులు అనురూప్‌శర్మ, సుదాంశ శర్మ, మురళీధర్, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు


తాడూరు: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణ డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు పూర్ణచంద్రారెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల విక్రయాలకు సంబంధించి రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాసిరకం విత్తనాలు విక్రయించొద్దన్నారు. రికార్డులు, స్టాకు వివరాలు బోర్డుపై రాసి ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, ఏఈఓ శ్రీకాంత్, ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతర విజయవంతం చేయండి



పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించే పూలే, అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్వకోలులో జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. బహుజన కళాకారులతో ధూంధాం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల రాజ్యాధికారం లక్ష్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, నరేందర్, వెంకటయ్య, విజయ్, రాముడు, కురుమూర్తి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కొట్రలో ఉచిత కరాటే శిక్షణ



వెల్దండ: మండలంలోని కొట్రలో ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు కరాటే మాస్టర్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కరాటే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో సెలవులు వృథా చేసుకోవద్దన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు



కల్వకుర్తి రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటునట్లు మున్సిపల్ కార్మికులు మంగళవారం కమిషనర్ మహమ్మద్ షేక్‌కు నోటీసు అందజేశారు. తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆంజనేయులు, రమేష్, వెంకన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మారెడు శివశంకర్ కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబుకు సమ్మె నోటీస్ సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, సింగోటం, అశు తదితరులు పాల్గొన్నారు.